# నమ్మకం

మనం అధికారంలో ఉన్నప్పుడు మన ప్రాపకం కోసం ఎందరో అర్రులు చాస్తారు! కొందరిని అవసరానికి మించి చేరదీస్తాం! మరి కొందరిని అనుకోకుండా దూరాన ఉంచుతాం!

అయితే మనం అదరించి చేరదీశాకే నల్గురి దృష్టిని ఆకర్షించిన వాళ్ళూ, మన మూలంగానే తమ అస్తిత్వానికో గుర్తింపు తెచ్చుకున్నవాళ్ళు.. మనకే ఎసరు పెట్టి, మన సీట్ నాక్రమించుకోవాలని చూసినప్పుడు సహజంగానే మన హృదయం బరువెక్కుతుంది !

అలా అని మన పట్ల జరిగిన నమ్మక ద్రోహాన్ని అందరి ముందూ ఏకరువు పెడ్తూ నల్గురికీ వినోదం కల్గించకుండా 'మాట్లాడని మల్లెమొగ్గ మాదిరిగా నడిచి' పోతే హుందాగా ఉంటుంది ! మన డీసెన్సే మనకో ప్లస్ పాయింటవుతుంది !

నిజానికి 'స్వయం ప్రకాశక శక్తి' ఉన్న వాళ్ళు - నమ్మకద్రోహానికి గురైనప్పుడు సంయమనం పాటించి - తగు సమయం కోసం నిరీక్షిస్తారే తప్ప తమకింత అన్యాయం జరిగింది - అంత అన్యాయం జరిగిందంటూ గగ్గోలు పెట్టరు.

మనని కంటికి రెప్పల్లే కాపాడుకుని, మనం అంచెలంచెలుగా ఎదగడానికి దోహద పడిన యజమానికి మనం ఎప్పుడో ఏ బలహీన క్షణంలోనో 'నమ్మక ద్రోహం' తల పెట్టాలనే ఆలోచన మనకొచ్చినప్పుడు - అతడికి మన మీదున్న 'విశ్వాసం' గుర్తొచ్చి - మనలో అలాంటి చెడు తలంపులు వచ్చినందుకు సిగ్గుపడి వెనక్కి తగ్గుతాం!

అదే క్షణాన -

మన సొంత సంస్థల్లే - ఎంతో నిజాయితీగా పని చేస్తున్నప్పటికీ చెప్పుడు మాటలకు లోనై మన యజమాని మన ప్రతి కదలికనూ తన ఎక్స్‌రే కళ్ళతో పరికిస్తూ, మనవి అనుమానిస్తున్నాడనే భావన తలెత్తినప్పుడు "ఇన్నాళ్ళూ 'విశ్వాసం గల కుక్క' లా ఈ సంస్థలో ఎందుకు పడి ఉన్నామా ?" అని అభిమానపడి తప్పుకో చూస్తాం!

కొందర్లో 'అభద్రతా భావం' అవసరానికి మించి ఉంటుంది ! ప్రతి పనీ 'గుట్టు'గా చేయాలనుకుంటారు ! ఇలాంటి వాళ్ళు ఎవర్నీ విశ్వసించరు కాబట్టి నిజమైన స్నేహితులంటూ ఎవరూ మిగలరు !

మరి కొందర్లో 'అమాయకత్వం' అధిక పాళ్ళలో ఉంటుంది ! ఇలాంటి వాళ్ళు అందర్నీ నమ్మి - చెప్పాల్సినవీ, చెప్ప కూడనవీ అన్నీ చెప్పేసి - గొంతు మీదికి తెచ్చుకుంటారు.

అయినా, ఎదుటి వాళ్ళని 'నమ్మాలా వద్దా' అని తర్కిస్తూ - కొందరు మంచి వ్యక్తుల సాహచర్యాన్ని అనుభవించే అదృష్టాన్ని దూరం చేసుకునేకన్నా - కొన్ని ఎదురు దెబ్బలు తిన్నాసరే - ఎదుటి వాళ్ళని నమ్మి జీవితంలో ఎన్నో గుణపాఠాలూ తద్వారా జీవిత సత్యాలూ నేర్చుకోవడం మంచిది!

16-12-1996